# వెలి అంటే?

శ్రీ సి. హెచ్. రామమూర్తి

అది ఒక నాటి సంధ్యాసమయము. ఆ రోజే పౌర్ణమి. ప్రశాంతముగా నున్న ప్రకృతిని, పూర్ణచంద్రుని పరికిస్తూంది ప్రభావతి డాబామీద. ఇంతలో "అమ్మా" అంటూ తన దగ్గఱకు చేరింది కుమార్తె శశి.

"యేమమ్మా! యింత ఆలస్యమైంది"

"యేం లేదమ్మా, మా స్నేహితురాలు సావిత్రిగారి యింటికి వెళ్లేను."

ఎప్పుడూ కళకళ లాడుతూన్న మోము ఆ వేళ చిన్నబోవటం గమనించక పోలేదు తల్లి. ప్రభావతి మోహనులకు ఒక్కతే కుమార్తె శశి. క్రొత్తగా కాలేజీలో చేరింది. ఇంతకు ముందు పొరుగిండ్లకు పోవటంగూడ యెఱుగదు; అయినా కాలేజీలోచేరిన ప్రతి వారికి స్వతంత్రం అనేది కొంత అలవడటము సహజము.

"అమ్మా; వాళ్లయింటిలో సావిత్రి అమ్మమ్మ...యింకా...మరెవరో కొందరు నన్నుజూచి మనల్ని గురించి యేమేమో మాటలాడుకుంటున్నారు. ఆ ముసలి మనల్ని వెలి వేశారని వాళ్లతో చెప్పింది. వెలివేయటం, అంటే యేమిటమ్మా?"

ఈ మాటలు ప్రభావతిని కలతపెట్ట సాగాయ్. ఒక్క మారు శశి చిన్నతనము నుండి వేసిన ప్రశ్నలు జ్ఞప్తికి వచ్చాయ్.

"అమ్మా లీల యీ పండగకు వాళ్ల తాతగారింటికి వాళ్లమ్మతో కలిసి వెళ్తుందట; మనము వెళ్లమూ?

సుశీలగారి యింటికి బంధువులు వచ్చారని చెప్పింది. మన యింటికి యెప్పుడూ రారేమమ్మా?"

ఆ ప్రశ్నలకు యెప్పుడూ జవాబు సరిగా చెప్పలేక తీయని కబుర్లతో సంతోష పెడుతూ వుండేది. కాని యీ ప్రశ్నకు మాత్రము జవాబు చెప్పనిశ్చయించింది.

"శశీ, మనల్ని వెలివేశామంటున్నారా! అలా కాదు; మనము వారిని, ఆ మూఢ సంఘాన్ని వెలివేశాము. నేను చెప్పబోయె కథవిను – నీ ప్రశ్నకు యీ కథ జవాబు చెబుతుంది. ఇది నా జీవిత కథ."

"భాగ్య వంతుల యింట్లోనే జన్మించాను. గారాబముతో తల్లిదండ్రులు పెంచడం, చదువు నేర్పించడము నిజము. కాలేజి మెట్లు గూడ ఎక్కనని యింతకు ముందే నీకు తెలుసు. చిన్నతనమునుండి ప్రతివారు తమ ఊహా భవనాలకు మెట్లు నిర్మిస్తూనే వుంటారు. కాని, నిలవటం కష్టము. నేను గూడ అందరివలెనే తీయని ఊహలతో, చెప్పరాని తలపులతో భావి జీవితములో చేయవలసిన కార్యాలను నిర్ణయించుకొనే దాన్ని. జీవితం ఒక నాటకము. ఆ నాటక

ములో మూడే అంకములు. మొదటిది బాల్యము, రెండవది యవ్వనము, మూడవది వృద్ధత్వము. ప్రథమాంకములో అందరి జీవితాలు సమానమని అనుకోవచ్చును. ప్రథమాంకమునకు మిగిలిన అంకములకు యేమీ సంబంధముండదు. నా జీవితములో ప్రథమాంకము సంతోషముగానే గడిచింది. ద్వితీయాంకము వివాహముతోనే ప్రారంభమైంది. మంచి సంబంధము చూసి వివాహానికి ముహూర్తము నిశ్చయించారు తల్లిదండ్రులు. అది వారి బాధ్యత. కట్నాలు యిచ్చేరు. కానుకలు పంపేరు. పెండ్లి కుమారుడు అందమైనవాడే. చదువుకున్నవాడూను.''

''విధి వ్రాత ఎవరు తప్పించగలరు? అట్లని ప్రయత్నాలు మానుకోరాదు. పెండ్లి రోజువచ్చింది. పెండ్లి అయింది. నాటితో చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది. కార్యము అయిదవ రోజున అని ముహూర్తము నిశ్చయమైంది. మన నిశ్చయాలు, నిశ్చయాలు కావు. ఆ రాత్రే పెండ్లి కుమారునకు జ్వరము వచ్చింది. దానికి తోడు దగ్గు. మరునాడు ''అక్కా బావకు టి. బి వుందని పెండ్లి వారు అనుకుంటున్నారు'' అని మా చెల్లి చెప్పడముతోనే తల తిరిగింది. వళ్లంతా చెమటపోసింది. జ్వరము దగ్గు దాని ప్రభావమై యుంటుందని భావించేను. అమ్మా, నాన్నలతో చెప్పగా యీ సంగతి ముందు తెలుసుకోలేక పోయినందుకు విచారించారు. తమ్ము తాము తిట్టుకున్నారు, నాల్గవరోజున అధికమైంది. సంతోషానికి బదులు దుఃఖము నన్నావరించింది. నా ఆరాటం; నా మనో వ్యథ! ఆ దేవునికే తెలియాలి! రాజమంద్రి తీసుక పోయినారు. వెళ్లిన మనిషి తిరిగి రాలేదు. వేసినపరుపు యెత్తలేదు నేను. మూడు రోజుల వరకు జ్ఞప్తిలేదు. మా బంధువులు స్నేహితులు వచ్చి నా దురదృష్టానికి చింతిల్లేరు. అంతకు తప్ప మరేమి చేయగలరు? నేను విచారముతో మంచము పట్టి భర్తనుకలుసుకొంటానను కొన్నాను. అంత పని జరగలేదు డాక్టర్ల దయవల్ల. ఇంతే నాజీవితము అని విచారిస్తూ వుండే దాన్ని. మా తల్లి దండ్రులు అంతే. మా అన్నయ్య మాత్రము మంచి కబుర్లు చెపుతూ సంతోష పెట్టడానికి ప్రయత్నిస్తూ వుండేవాడు. తిరిగి కాలేజిలో చేరడానికి యత్నించా. నా కోరిక సాగనివ్వలేదు.''

''క్లాసు పుస్తకాలకి బదులు పతివ్రతల కథలు నా టేబిలుని ఆక్రమించాయ్. సావిత్రి, అనసూయ మొదలగు పతివ్రతలందరూ గోడలను ఆక్రమించారు. ఈశ్వరుడూ, విష్ణు, లక్ష్మి, సరస్వతీ మొదలగు వారు నా అల్మరాలను ఆక్రమించారు. రంగు చీరలు, వాయిల్ చీరలు, పట్టు చీరలకు బదులు తెలుపు వస్త్రాలు నా పెట్టెలను

ఆక్రమించాయ్. ఇలాగు ఒక సంవత్సరము గడిచింది.........అమ్మాయీ నీకేమీ అర్థము కాలేదా? స్త్రీ రెండవ వివాహము చేసుకోకూడదట. వారి సాంప్రదాయము పై అలంకారాలన్నీ దానికోసమే. అంటే నేను మరి వివాహము చేసికొని భర్తతో సుఖించుట దోషమన్నమాట''

''స్త్రీగాని పురుషుడుగాని ఒంటరి జీవితానికి యిష్టపడరు. నా అభిప్రాయాలు వేఱు. స్వాతంత్ర్యము సర్వజనహక్కు. పురుషులకు మాత్రమే అంటే నా మనస్సు ఒప్పుకుండేదికాదు. యౌవనములోనున్న ప్రతి జీవి కామదేవత బాధకు గురికాక తప్పదు. దానిని తీర్చుకోవటానికి అనేక విధములు ప్రయత్నిస్తారు. నా విషయములో కూడ అంతే. నా ముఖ్యోద్దేశము రెండవ వివాహముచేసికోవటమే. ఈ విషయము అమ్మ చెవిలో వేసాను. కాని ఆ సంఘానికి వెఱచిన జీవి ''తప్పమ్మా యెప్పుడూ అట్లన కూడదు. నీ అదృష్టము...నీ వ్రాత...'' అంటూ యేడ్చింది. నన్ను యేడ్పించింది.''

మా అన్నయ్య స్నేహితులలో మోహన్ - మీనాన్న ఒకరు. ధనవంతుడు, గుణవంతుడు. స్వాతంత్ర్య ప్రియుడు. బి. ఏ. పాసవటంకూడ అప్పటికి జరిగింది. అతను తరచుగా మా యింటికి రావటం జరుగుతూవుండేది. అతనితో మాట్లాడటానికి అవకాశము చిక్కుతూండేది. ఒక రోజు ''మోహనరావు గారూ: మీకే వుద్యోగమూ దొరకకపోవటం ఆశ్చర్యమే'' అని అన్నాను. ''యే వుద్యోగమూ చేయడానికి యిష్టములేదండీ యేదో తిండికి యింత వున్నప్పుడు ఆ చాకిరి చేయడమెందుకండీ.'' అని జవాబు వచ్చింది. ''అట్లా అంటారేం. యింత వుండొచ్చు తిండికి. లేకపోతే జమిందారు కావచ్చు. ప్రతివారు యిట్లని కూర్చుంటే దేశము బాగుపడే దెట్లండీ'' చిరునవ్వుతో అన్నాను ''మీరు చెప్పింది నిజమే. నేను మాత్రము పూర్తిగా ఆ జాతికి చెందలేదు. నా చేతనయినంత వరకు సహాయము చేయకపోలేదు లెండీ'' నవ్వుతూ జబాబిచ్చేరు. ఇట్లు అనేకసార్లు మాటలాడటం జరిగింది. అన్నయ్యగూడ మాతో జోక్యము కలుగ జేసుకుండేవాడు. క్రమముగా మా యిరువురి మధ్యస్నేహము యేర్పడింది. ఒక సంధర్భములో

''దిక్కులేని వారిని రక్షించడం, అన్యాయం జరిగినవారికి న్యాయమిప్పించడము నా విధి'' అని వెల్లడి చేసారు. ఆ రాత్రంతా మెదడులో ఆ మాట ప్రతిధ్వనించింది. ఆ మాటలో ఎంత అర్థముంది! నేనితనిని ప్రేమించడము నగ్నసత్యం. నా ఉద్దేశము అతనికెఱుక పరచటం అసత్యం. బహుశా నా వుద్దేశము తెలిసి వుంటుందా? లేక నన్ను ప్రేమించాడా చీ...ఒక విధవని చేసుకున్నేంత మూర్ఖుడుకాడు. ఎందుకుకా

కూడదు! ఆ మాటలలోని భావము. ఆకండ్ల లోని చిలిపితనము తను ప్రేమిస్తున్నట్లు చెప్పినట్లనిపించేది నాకు. నా అనుమానము తీర్చడానికి నా చెయి వుత్తరం వ్రాసింది. పిచ్చిపిచ్చి ఊహాలను యిమిడ్చింది. అన్నయ్యకు తెలియకుండా మోహన్ జేబులో వేసింది. తిరిగి జబాబువచ్చేవరకు శ్వాస ఆగిపోయినట్లయింది. భయము నన్నావరించింది. అనుకూలముగానే జవాబు వచ్చింది. "మీ దురదృష్టానికి చింతిల్లిన వారిలో మొదటివాడిని నేను. అప్పటినుండి. మిమ్మల్ని చూస్తే జాలికలుగుతూంది. అదిగాక నీ సౌందర్యం, నీతీయనిమాటలు రోజూ నన్ను పులకరింప జేస్తున్నాయ్. నేనింత వరకు వివాహము చేసుకోపోవటానికి కారణంగూడ యీ వుత్తరంలోనే వుంది" అని కూడ వ్రాసివుంది. నా సంతోషానికి మేర లేదు. నిజము అబద్ధమాడరతను – అని మనస్సులో అనుకున్నాను. కొన్ని వుత్తరాలు మా యిరువురిమధ్య నడిచాయ్. మోహన్, నేను తల్లి దండ్రులకు అభిప్రాయాలు చెప్పనిశ్చయించుకున్నాము. చెప్పేము ఒప్పుకోలేదు. కసిర్దారు–సంఘము బహిష్కరిస్తుందన్నారు. తీరనిమచ్చ. ఏదేదో అన్నారు. పట్టినపట్టు విడువనన్నాను. బంధువులచే బోధింపించేరు, తిట్టేరు చావమన్నారు. చంపేస్తామన్నారు. ఈ సంగతి ఊరంతా ప్రాకింది. ఎక్కడ జూచినా యివే మాటలు, యేయింట జూచినా యివే గుసగుసలు. మేము వెఱవ లేదు సంఘానికి–భయపడలేదు. భయపడాల్సిన అవసరమేముంది? అది మావ్యక్తిత్వం. మోహన్ తన తల్లితో చెప్పిన ఆఖరిమాట లివి "ప్రభ అపవిత్రురాలుకాదు. అనాథ. నన్ను నమ్మింది. ప్రేమించింది. వివాహం జేసుకోవటము తప్పదు." ఒక రోజున బయలుదేరాము. ఎక్కడికో మాకు తెలియ లేదు. రాత్రికాదు. పగలే. దొంగతనముగా లేచిపోలేదు. వీధిలో మమ్ముచూసిన వృద్ధ జంబుకాలు ముక్కుమీద వ్రేలు వేసుకుంటూ తిట్టేయ్. విద్యావంతులైన యువక సమూహాలు హెచ్చరించాయ్. ఈ పట్నానికి వచ్చాం."

"రిజస్ట్రారు ఆఫీసులో వివాహము జరిగింది. బంధువులు హాజరుకాలేదు. బ్రాహ్మణులు మంత్రాలు చదవలేదు. ఈ వూరిలో యెవరు పోషిస్తారు మమ్మల్ని. మీ నాన్న ఉద్యోగములో చేరక తప్పిందికాదు. కొన్ని రోజులలో తన ఆస్తి తెచ్చుకోగలిగారు. ఇదీ నాకథ. అర్థమైందా వెలివేయడమంటే? అప్పటినుండి ఎవ్వరితో సంబంధము లేకుండా హాయిగా జీవిస్తున్నాం" అంటూ ప్రభ కథ ముగించింది. శశినవ్వటము మోహనరావు యింటికి రావడము ఒకేసారి జరిగాయ్. తల్లీ పిల్లలిద్దరూ చల్లగా యింట్లోకి చేరుకున్నారు.

——(o)——